
# విజృంభణ

- రాచకొండ సుభద్రాదేవి



తెల్లని ప్రహరీగోడకు అమర్చిన గేటులోంచి లోపలి బిల్డింగ్ దాకా పేవ్‌మెంట్‌కి రెండువైపులా బారులు తీర్చిన పంచరంగుల గులాబీలు, మధ్య మధ్య క్రోటన్ మండీలు, బిల్డింగ్ వరండా మీద గుత్తులుగా పూసే సన్నజాజులు నవ్వుతూ పలకరిస్తున్నాయి ఆ

హాస్పటల్‌కి వచ్చే పేషెంట్స్‌ని, హాస్పటల్ డాక్టర్ రూమ్‌లో అప్పుడే మ్యాచింగ్ పూల బొకే తయారుచేసి ఫ్లవర్‌వాజ్‌లో అమర్చాడు తోటమాలి. డాక్టర్ వచ్చే సమయమేమో నర్సులు, వార్డుబాయ్‌లు హడావిడిగా తిరిగేస్తున్నారు.

మెటర్నిటీ వార్డు నాలుగో నెంబరు రూమ్‌లో సౌజన్య ఆదమరచి నిద్రపోతోంది. కర్టెన్ సందుల్లోంచి లేత కిరణాలు ముఖం మీద పడి సడెన్‌గా లేచింది.

'నర్స్... ఎవరో నన్ను అమ్మా అని పిలిచారిందాక. లేత పెదవులతో అలా దీనంగా పిలుస్తున్న ఆ పాపెక్కడ?' శూన్యంలోకి చూస్తూ అడిగింది.

'అమ్మా... ఏదో కలొచ్చుంటుంది మీకు. డాక్టరమ్మొస్తోంది. దుప్పట్లు మార్చాలి' అంటూ దుప్పట్లూ, పిల్లో కవర్లతో వస్తున్న వార్డుబోయ్‌కి రూమ్ చూపించడానికి వెళ్ళింది నర్సు.

సౌజన్య మెల్లిగా లేచి ముఖం కడుక్కుని, చీర మార్చుకుని, కొత్త దుప్పటి వేసిన బెడ్ మీద మళ్లీ ఒత్తిగిల్లింది. అంతలో మళ్లీ 'నీ వెచ్చని ఒడిలో నిద్రపోనీయమ్మా... నన్ను బ్రతికించమ్మా...' అన్న మాటలు వినపడ్డట్టుగా తోచి ఆదుర్దాగా లేచి కూర్చుంది. మళ్లీ సిస్టర్‌ని పిలిచి ఆదుర్దాగా అడిగింది.

'సిస్టర్... మళ్లీ అదే. నేనెంత నిర్భాగ్యురాలిని.'

'అమ్మా... అదంతా మీ భ్రమేగాని ఎవరూ లేరమ్మా ఇక్కడ. ధైర్యంగా వుండండి. డాక్టరొచ్చే వేళయింది' అంటూ వెళ్లిపోయింది సిస్టర్.

'అమ్మా... బ్రెడ్, మిల్క్ తీసుకోండి' బండితో వచ్చిన బాయ్ కేకకి నీరసంగా ఆకలి లేదని చెప్పి పంపేసింది.

మళ్లీ అదే పిలుపు.

'సిస్టర్... మళ్లీ కేకేస్తోంది పాప. నువ్వయినా డాక్టర్‌కి చెప్పి ఈ ఆపరేషన్ తప్పించవా' ప్రాధేయపడుతూ అడిగింది సౌజన్య.

'నే చెప్తే ఏం లాభమమ్మా. మీ అత్తగారు ఒప్పుకుంటుందా. డాక్టరమ్మ కూడా చాలా చెప్పి చూసింది' నీరసపడిపోయిందా మాటకి సౌజన్య.

❖ ❖ ❖

'అమ్మా... ఇవాళ నేనూ శెలవు పెడతాన్లే. నువ్వొక్కదానివీ ఏం తంటాలు పడతావ్.'

'అక్కర్లేదు బాబూ... ఆపరేషన్ అవగానే తీసుకొచ్చేస్తాగా. దానికి మాత్రం నువ్వు కొంచెం చెప్పు. మొండిపట్టు పట్టుక్కూర్చుంది.'

'నలుగుర్నీ చూస్తుంటే పాపం దానిక్కూడా అమ్మననిపించుకోవాలని వుండడం సహజం కదమ్మా.'

'అయితే నువ్వనేదేంటీ? ఆడపిల్లని తెలిపోయింది. దానికి పెళ్లి చేసి అత్తారింటికి పంపేటప్పటికి నువ్వు చిప్ప చేతపట్టుకోవలసిందే. నీకిష్టమైతే మధ్య నాకెందుకూ? ఈ వేళో, రేపో పోయేదాన్ని...'

'కాదమ్మా... కోపం తెచ్చుకోకు. నీ ఇష్టమొచ్చినట్లే చేద్దాంలే. ఊరికే చెప్పానంతే. సరే, నాకు ఆఫీసుకి టైమవుతోంది.'

తల్లీకొడుకుల సంభాషణ విన్న సౌజన్య అత్తగారితో- 'అత్తయ్యా... అంత పాపానికి ఒడిగట్టకండి. ఇది కూడా హత్యతో సమానమే. ఇప్పటికి రెండుసార్లయింది ఇలాగే. ఇప్పుడైనా ఈ దారుణం ఆపండి' అంది ఎంతో దీనంగా.

'నోరుముయ్యవే... పిట్ట కొంచెమైనా కూత ఘనమన్నట్లు- మంచీ చెడ్డా ఆలోచించే మేం వుండగా, నువ్వేం సలహా ఇవ్వనక్కర్లేదు గాని, పదపద తయారవ్. రిక్షా వస్తోంది' కస్తూరమ్మ గట్టిగానే కస్సుమంది.

❖ ❖ ❖

కడుపునిండా భోంచేసి, ఫ్లాస్క్ నిండా కాఫీ పోసుకుని చేతిలో భగవద్గీతతో కోడల్ని తీసుకుని రిక్షా ఎక్కింది కస్తూరమ్మ. హాస్పటల్ చేరేసరికింకా డాక్టర్ రానట్లుంది నర్సులంతా రిలాక్సింగ్‌గా కూర్చున్నారు కబుర్లు చెప్పుకుంటూ. సౌజన్య, కస్తూరమ్మ వరండాలో బెంచీ మీద కూర్చున్నారు డాక్టర్ కోసం ఎదురుచూస్తూ. డాక్టరొస్తున్నట్లు ఎలా పసిగట్టారో వార్డ్ బాయిస్ హడావిడిగా బెడ్‌షీట్స్ మార్చే పనిలో ఉరుకులు తీస్తున్నారు. నర్సులు కూడా ఎక్కడివాళ్లక్కడ సర్దుకున్నారు. ఇంతలో మెరిసిపోతున్న మారుతీ కారులో దిగింది డాక్టర్ ప్రమీల. లైట్ బ్లూ ఫారెన్ నైలెక్స్ చీర, తలలో

మల్లెచెండు, కనీకనిపించని లిప్‌స్టిక్, చిన్న కుంకుమ బొట్టూ, చిరునవ్వుతో పలకరిస్తూ లోపలికి వెడుతుంటే, జబ్బులు సగం తగ్గిపోయాయనిపించాయి అక్కడున్న పేషెంట్లకి.

కాసేపటికి సౌజన్యని పిలిచింది డాక్టర్. కస్తూరమ్మ కూడా లోపలి కెళ్లబోతుంటే ఆయా, 'పేషెంటే వెళ్లాలమ్మా... మీరిక్కడే వుండండి. మిమ్మల్నీ పిలుస్తారు డాక్టర్' అని ఆపింది. చిన్నబుచ్చుకున్న ముఖంతో, కోడలితో డాక్టర్ ఏం మాట్లాడుతుందో అనే ఆత్రంతో దిగాలుగా బెంచీ మీద కూలబడింది కస్తూరమ్మ.

'నేనెంత చెప్పినా మీ అత్తగారు వింటంలేదమ్మా. ఎలాగైనా అబార్షన్ చెయ్యాలని పట్టుపడుతోంది. నాకూ ఈ పని ఇష్టం లేదు. ఏం తోచడం లేదమ్మా' అంది డాక్టర్ ప్రమీల ఎంతో ఆదుర్దాగా.

'డాక్టర్ మీరు నాకు అమ్మ లాంటివారు. మీరే కాపాడాలి- నన్నూ, నా పిల్లని. నాకీ పాప కావాలమ్మా...' అంటూ కళ్లనీళ్లతో మెడలో గొలుసు తీసి డాక్టర్ చేతిలో పెట్టి బావురుమంది మౌనంగా.

'ఛ... ఊరుకో సౌజన్యా... అంత ఇదైపోతే ఎలా చెప్పు. నేను చెప్పినట్లు చెయ్యి. చూద్దాం ఎలా వస్తుందో' గొలుసు తీసి సౌజన్య మెడలోనే వేసింది డాక్టర్.

'అమ్మా... నన్ను అమ్మనవాలని ఆశీర్వదించండి' అంటూ మళ్లీ బావురుమంది. సౌజన్యని ధైర్యంగా వుండమని చెప్పి, నర్సుల్ని పిలిచి సౌజన్యని ఆపరేషన్‌కి ప్రిపేర్ చెయ్యమని చెప్పింది.

సౌజన్య గాజులు, గొలుసు, మంగళసూత్రం తీసి బయట కూర్చున్న కస్తూరమ్మకి పంపింది. హాస్పటల్ డ్రెస్‌తో స్ట్రెచర్ మీద వెడుతున్న సౌజన్యని దూరం నుంచి చూసింది కస్తూరమ్మ తృప్తిగా.

కొద్ది నిముషాలకి డాక్టర్ కూడా అటుగా వెడుతుంటే కస్తూరమ్మ పరుగున వెళ్లి చేతులు పట్టుకుని- 'ఎలాగైనా ఈ పుణ్యం కట్టుకోండి డాక్టరమ్మా' అంటూ ప్రాధేయపడింది. డాక్టర్ ప్రమీల ఏమీ అనలేక మౌనంగా నడిచింది అక్కడ నుంచి.

❖ ❖ ❖

ఆపరేషన్ థియేటర్‌లో సౌజన్యకి అన్ని టెస్ట్‌లూ చేశారు నర్సులు. డాక్టర్ ప్రమీల వచ్చినట్లే

## నడిచే పాదాలంటే ఇష్టం

నడిచే పాదాలంటే ఇష్టం
రెండు చక్రాల సైకిల్ తొక్కడం చూసినా ఇష్టమే
రెండు చక్రాల బండినో నాలుగు చక్రాల బండినో
ఒకటో రెండో నాలుగు పాదాల పశువులు లాగడం
దాన్నొక రెండు పాదాల మనిషి తోలడం కూడా
ఇష్టమే

ఒకోసారి నడిచే రెండు పాదాలూ
ఒక చక్రాన్ని రెండు పక్కల్నించి తొక్కుతుంటే
మొత్తం మూడుచక్రాలు కదుల్తాయి చూడు
దానిమీద బరువులుంటాయి చూడు
ఆ దృశ్యం కూడా ఇష్టమే

నాలుగు టైర్లో ఆరు టైర్లో
అద్దాల కళ్లతో నడుస్తుంటే భయం నాకు
పామునో పులినో చూసినట్టు
తక్కువ ఇష్టం, చాలా ఎక్కువ భయం

ఇప్పుడు నా సంతానం నాలుగు
చక్రాల విదేశీ అందాలు కొన్నారట
సంతోషంతో వారా వార్త చెబుతుంటే
అమెరికా ఆయిల్ ఎడారుల మీదా
ఆఫ్ఘనిస్తాన్ కొండ కోనల్లోనూ
దాడి చేసినంత భయం పట్టుకుంది
ఆధునిక యంత్రాలంటే భయం కాదు
ఆ వెనకున్న మనుషులంటేనే భయం

ఒకటికి నాలుగుసార్లు
నా రెండు పాదాలకేసీ చూసుకున్నాను
సజీవ కండరాల్తో గుండెల్తో కదిలే పాదాలన్నా
ఆ పాదాల మీద నడిచే మనుషులన్నా
నాకు ప్రేమా గౌరవమూ ముమ్మరిస్తున్నాయి

– డా. మానేపల్లి

వచ్చి హడావిడిగా ఇంకో డాక్టర్‌కి ఫోన్ చేసింది. ఏదో చాలాసేపు మాట్లాడింది. సౌజన్యకంతా అయోమయంగా వుంది.

డాక్టర్ కంగారుగా కస్తూరమ్మని లోపలికి పిలిచింది.

'చూడండమ్మా... ఆపరేషన్‌కి అంతా సిద్ధం చేశాక ఇంకో పెద్ద డాక్టర్‌ని కూడా సంప్రదించాను. ఈ ఆపరేషన్ వల్ల తల్లి ప్రాణానికి గ్యారంటీ లేదని నాకనిపించి ఆయన్ని అడిగాను. ఆయన కూడా అదే చెప్పారు. మీ అబ్బాయిని కూడా పిలిపించండి. ఆయన అభిప్రాయం కూడా తెలుసుకుని, ఆయనా, మీరూ దీనికి ఇష్టపడుతున్నట్లు, తర్వాత ఏం జరిగినా మీ బాధ్యతేననీ ఈ కాగితాల మీద సంతకాలు చేసివ్వండి. ఇది కొంచెం రిస్క్ వున్న ఆపరేషన్. పదివేలు పైగా ఖర్చవుతుంది. మీకది కూడా అంగీకారమైతే మళ్లీ లక్ష్మీవారం నాడు ఆపరేషన్ చేస్తాను' అంది.

కస్తూరమ్మ కొంచెం ఆలోచించి, 'సౌజన్యను తీసుకెళ్లి అబ్బాయితో కూడా ఆలోచించి చెబుతాను' అంది.

నర్సుతో సౌజన్య డ్రెస్ మార్చమని చెప్పి సౌజన్యను ధైర్యంగా ఉండమంది డాక్టర్ ప్రమీల.

రిక్షాలో తిరుగుముఖం పట్టారు అత్తాకోడళ్లు.

'ఇప్పటికే నాలుగు నెలలొచ్చేశాయ్. ఏదైనా అపసవ్యం అయితే దాని వాళ్లంతా కట్టకట్టుకుని ఇంటిమీద పడతారు. ఈ ఆపరేషన్ కోసం పదివేలు ఎలోగా తేవాలి. మళ్లీ పెళ్లి చేస్తే కావలసినంత కట్నాలతో పిల్లలొస్తారు గాని నానా అల్లరీ అవుతుంది. ఏం చెయ్యాలా?' అని మథనపడుతోంది కస్తూరమ్మ మనసు.

❖ ❖ ❖

'ఏమైందమ్మా?' అని ఆత్రంగా అడిగాడు ఆఫీసు నుంచొచ్చిన కస్తూరమ్మ కొడుకు.

'ఏం చెప్పమంటావ్? అంతా తారుమారైంది. దేనికైనా ఇంత అల్లరి పనికిరాదురా. మొదట నుంచీ అది ఒకటే అపశకునం. ఘోష ఎక్కువైపోయిందిరా కన్నా. నెలలెక్కువవడంచేత తల్లి ప్రాణానికి గ్యారంటీ ఇవ్వలేనంది డాక్టర్. అయినా సరే, మనం చెయ్యమంటే పదివేలు ఖర్చవుతుందని చెప్పింది. ఎక్కడ తెస్తావురా వున్నపాటున అంత డబ్బు?'

'అవసరమైతే ఇంటిమీద లోన్ తీసుకోవచ్చులే. నీ ఇష్టం... నువ్వేమంటే అలాగే చేద్దాం.'

'అదే ఆలోచిస్తున్నాన్రా. ఇంత కష్టపడ్డాక దీనికేమైనా అయిందంటే లోకులు కాకుల్లా పీకేస్తారు. అంతకు నాలుగు రెట్లు కట్నంతో మళ్లీ పెళ్లి చేసెయ్యగలను నిముషాల మీద. ఏమంటావ్?'

'అంత అవసరం గనుక వస్తే...'

రెండు కాఫీ కప్పులు ట్రేలో పట్టుకుని వచ్చిన సౌజన్యని చూడగానే తల్లీకొడుకులు మాటలు ఆపేశారు.

కోపంతో ఊగిపోతూ సౌజన్య, 'ఆగండత్తయ్యా... ఆఖరుసారిగా నా చేతి కాఫీ తీసుకోండి. మహాశయా... తమరు కూడా. మీ మాట విని ఎంత పొంగిపోయానో నేను. మీవెంత రాతిగుండెలు. కనీసం మరో కోడలినైనా జాగ్రత్తగా చూసుకోండి. మీ తల్లిదండ్రులకి ఇలాంటి పాడుబుద్ధి పుట్టివుంటే మీరే వుండేవారు కాదత్తయ్యా... మీ రాబోయే కోడలు, వాళ్లమ్మా, నాన్నా ఇలాగే అనుకుంటే మీ అబ్బాయికి కట్నం గుమ్మరించేదెవరమ్మా? మీరూ ఒక తల్లేనా? మీకంటే గొర్రెల్లు వెయ్యి రెట్లు నయం.'

'అయ్యా... తమరు కష్టపడి అప్పు తీసుకొని రావద్దు. నేను ఆపరేషనూ చేయించుకోను. మీ సంగతి ఈపాటికి పోలీస్‌స్టేషన్‌కీ, పేపర్లకీ వెళ్లి వుంటుంది. మీ సమర్థతని చూసి ఎంతమంది ఆడపిల్లలు మీచేత తాళి కట్టించుకుందుకు ముందుకు వస్తారో నేనూ చూస్తా. పుట్టబోయే మీ కూతురు ఉసురు పోసుకుని మళ్లీ పెళ్లికొడుకుగా తయారవండి. దేశమంతా మిమ్మల్ని చూసి గర్వపడుతుంది' తిరిగి చూడకుండా రోడ్డు మీదకొచ్చేసింది సౌజన్య.

తల్లీకొడుకులిద్దరూ సౌజన్య విజృంభణకి విస్తుపోయి తెల్లమొహాలేశారు. దిగాలుగా కుర్చీల్లో కూలబడిపోయారు వినవిసా వెళ్లిపోతున్న సౌజన్యని చూస్తూ...

●